# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, బుధవారం 25 డిసెంబర్ 2024 | VIKARABAD





మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

## న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పని సరి

వికారాబాద్, డిసెంబర్ 24 : న్యూ ఇయర్ వేడుకలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న వికారాబాద్ జిల్లాలోని రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో వేడుకలు చేసుకునే వారు పోలీస్‌స్టేషన్లలో అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలు, మద్యం, మత్తు పదార్థాలు నిషేధమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా..

మారని అధికారుల తీరు

లంచం ఇస్తేనే ఫైళ్లు ముందుకు..

లేకుంటే రిజెక్టే

ప్రతి పనికీ ఇంత అని ఫిక్స్ చేసి మరీ వసూళ్లు

పలు శాఖల్లో లంచాలకు ఎగబడుతున్న కొందరు అవినీతిపరులు

తాజాగా రూ.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన రెవెన్యూ అధికారులు

లంచం అడిగితే 9440446140 ఫోన్‌నంబర్‌ను సంప్రదించండి..



దానయ్య, మాణిక్‌రావులను ఏసీబీ కోర్టుకు తరలిస్తున్న అధికారులు

# అవినీతి తిమింగలాలు

## లంచమిస్తేనే పనిలో కదలిక..

*వరుసగా ఏసీబీ దాడులు జరుగుతున్నా జిల్లాలోని పలు శాఖల్లోని అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. కొందరు అధికారులు లంచమిస్తేనే పని చేస్తున్నారు. ప్రతి పనికీ ఇంత అని ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ భూ రికార్డులు, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల్లో ఎంతో కొంత ముట్టజెప్పనిదే పనులు జరగని పరిస్థితి నెలకొన్నది. తాజాగా తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోతోపాటు సీనియర్ అసిస్టెంట్ ఓ భూమి విషయంలో రూ. 5 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. మరో వైపు లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, అవినీతికి పాల్పడితే కటకటాలు తప్పవని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ నంబర్ 94404 46140 ను సంప్రదించాలని అవినీతి నిరోధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.*

*-వికారాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)*

కొందరు అధికారులు లంచమిస్తేనే పని చేస్తున్నారు. రెవెన్యూశాఖలో కిం ది నుంచి పై స్థాయి వరకు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతున్నది. భూ సమస్యల పరిష్కారంలో రైతుల నుంచి అం దిన కాడికి దండుకుంటున్నారు. ఇందుకు ఆర్‌ఐ రిపోర్ట్, తహసీల్దార్ అప్రూవల్ తప్పనిసరి కావడంతో చాలా మండలాల్లో డబ్బులిస్తేనే పనులు జరుగుతున్నాయి. లేకుంటే ఏదో ఒక కొర్రీ పెట్టి రిజెక్టు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా భూముల రిజిస్ట్రేషన్లకు వచ్చే వారిని సైతం తహసీల్దార్లు వదలడంలేదని.. ఉదయం స్లాట్ ఉన్నా సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్లు చేయకుండా ఆపుతూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారనే పలువురు మండిపడుతున్నారు. వైద్యారోగ్య శాఖలోనూ అవినీతి పెరిగిపోయిందనే ప్రచారం జోరందుకున్నది. వైద్యారోగ్యశాఖ కార్యాలయంతోపాటు క్లినిక్‌ల తనిఖీలు, సీజ్ పేరిట వసూళ్ల దందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా రిజిస్ట్రేషన్ల శాఖలోనూ అవినీతి పెరిగిపోయింది. సంబంధిత ఉద్యోగులు ప్రతి రిజిస్ట్రేషన్‌కూ డబ్బులిస్తేనే సంతకా లు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే సదరు అధికారులు నేరుగా కాకుండా ఏజెంట్ల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల్లోనూ ప్రతి పనికీ కమీషన్ ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొన్నది. సంబంధిత శాఖల అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు ఆయా శాఖలను బట్టి 5శాతం, 3, 2 శాతం మేర కమీషన్ ముట్టజెప్పాల్సిందే..! డబ్బులివ్వకపోతే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ శాఖలో చెక్కుపై సంతకం చేసేందుకూ రూ.2 వేలు లంచం ఇస్తేనే సంబంధిత ఉద్యోగులు సంతకం పెడుతున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పంచాయతీ రా జ్ శాఖలో పై అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు ఎంత చెల్లించాలో ముందే చెబుతారని.. ఆ మొత్తం ఇవ్వకుంటే ఫైళ్లు ముందుకు వెళ్లవనే ఆరోపణలున్నాయి.

### రెండో రోజూ కొనసాగిన ఏసీబీ దాడులు

తాండూరు : తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సా యంత్రం వరకు ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. భూమి పట్టా కోసం లంచం తీసుకుంటూ తాండూరు సబ్ కలెక్టర్(ఆర్డీవో) కార్యాలయ ఏవో దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నదా..? ఇంకా ఎవరెవరూ ఉన్నారనే విషయంపై సుదీర్ఘంగా విచారించారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఏసీబీ బృందాలు లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల ఇండ్లలో నూ తనిఖీలు చేశారు. అనంతరం దానయ్య, మాణిక్‌రావును ఏసీబీ అధి కారులు హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ ఘటన జిల్లా లో కలకలం సృష్టించింది. నియోజకవర్గంలో దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిపై సీఎం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### జిల్లాలో ఏసీబీకి చిక్కిన అవినీతిపరుల వివరాలు...

- కలెక్టరేట్‌లోని టీఎస్‌ఈడబ్ల్యూఐసీ కార్యాలయంలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్.. ఓ సివిల్ కాంట్రాక్టర్ నుంచి పరిగి రోడ్డులో రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- పరిగిలో విద్యుత్ శాఖ ఏఈ, తాండూరు సబ్ రిజిస్ట్రార్ ఓ కాంట్రాక్టు విషయంలో లంచం తీసుకుంటుండగా డీఎస్పీ స్థాయి అధికారికి పట్టుబడ్డారు.
- గతంలో పరిగి డిప్యూటీ తహసీల్దార్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ కలెక్టరేట్ ఎదుట ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- నవాబుపేట మండలంలోని గేటువనంపల్లి వీఆర్వో రూ.4 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు.
- జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేశ్ రిటైర్డ్ ఉద్యోగి పింఛన్ ఫైల్‌ను సంబంధిత ప్రధాన కార్యాలయానికి పంపేందుకు రూ.12 వేలు తీసుకుంటుండగా దొరికిపోయారు.
- జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ ప్రవీణ్ వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఓ కాంట్రాక్టరు నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ తాండూరు డివిజన్ ఇంజినీర్ శ్రీనివాస్ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా..
- ఓ భూ సర్వే విషయంలో జిల్లా సర్వే అండ్ భూరికార్డుల అధికారి సదాశివుడు రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

## తీర్మానాలు లేకుండానే పనులా?

### అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 24: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో నిధులు లేకున్నా.. ముందస్తు పనులు ఎలా చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కమిషనర్ సరస్వతి, ఏఈ నర్సింహరాజు, వినీల్ గౌడ్‌ను ప్రశ్నించారు. 28వ డివిజన్ పరిధిలో ఉన్న సప్తగిరి కాలనీలో కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరు చేసి.. సంవత్సరాలు గడిచిపోతున్నా ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలాంటి తీర్మానాలు, టెండర్లు లేకుండానే పనులు ఎలా చేయిస్తున్నారని కమిషనర్‌ను అడిగారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ పనులు చేస్తున్నారో కమిషనర్‌కు తెలియపోతే ఎలా అని నిలదీశారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

**మూర్ఖంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారు..**

కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే అన్నారు. గతంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి హెచ్‌ఎండీఏ నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. బడంగ్‌పేటకు రూ.50కోట్లు, మీర్‌పేట కు రూ.50కోట్లు, జల్‌పల్లికి రూ.25 కోట్లు, తుక్కుగూడకు రూ. 25 కోట్లు రోడ్ల కోసం కేటాయించినట్లు వెల్లడించారు.

**ఒక్క రూపాయీ ఇవ్వలేదు..**


గడిచిన సంవత్సర కాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంజూరు చేసిన ఎఫ్‌డీఎఫ్ నిధులను రద్దు చేయడం కాదు వెంటనే నిధులు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించాలన్న చిత్త శుద్ధి ఉంటే నిధులు ఇవ్వాలన్నారు. గతంలో కేసీఆర్ అభివృద్ధి చేసిన పనులకు కాంగ్రెస్ సర్కారు ప్రారంభోత్సవాలు చేస్తున్నదని అన్నారు. గతంలో రోడ్ల కోసం రూ.1450 మంజూరు చేస్తే జీవో మార్చి శంకుస్థాపనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ మున్సిపాలిటీలో ఇంటిగ్రెటెడ్ మార్కెట్లను ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మధ్యంతరంగా ఆగి పోయిన ఇంటిగ్రేటెడ్ పనుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్ణ గంటి అర్జున్, పెద్ద బావి శ్రీనివాస్‌రెడ్డి, యాతం పవన్ కుమార్, ఏనుగు రాంరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.




హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ఇకపై ట్రాన్స్‌జెండర్లు విధుల్లో కొనసాగనున్నారు. మంగళ వారం ఉదయం నుంచి నగరంలో శిక్షణ పొందిన 39 మంది ట్రాన్స్‌జెండర్లు విధుల్లోకి చేరారు. చిత్రంలో ఆలుగడ్డ బావి సిగ్నల్ వద్ద ట్రాఫిక్ విధుల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్స్ - సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ)

## క్రిస్మస్ కాంతులు

### ముస్తాబైన చర్చిలు.. విద్యుద్దీపాలతో అలంకరణ



విద్యుద్దీపాలతో అలంకరించిన వికారాబాద్ చర్చి

నేడు జరిగే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చర్చిలను ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణలతో రాత్రి వేళ ల్లో చర్చిలు జిగేల్‌మంటున్నాయి. చర్చిల ప్రాంగణాలు, పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు. చర్చిల్లో ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, నక్షత్రాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం చర్చిల్లో అన్ని వసతులను కల్పించారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

## ఇదేనా కాంగ్రెస్ నేతల తీరు..

**తొక్కిసలాటలో కిందపడితే.. ఒక్కరూ పట్టించుకోలేదు..**

**ఇదేనా మహిళలపట్ల శ్రేణులకు ఉన్న గౌరవం**

**మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కొండ్రు పుష్పలీల అసహనం**

ఆదిబట్ల, డిసెంబర్ 24 : మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కొండ్రు పుష్పలీల శ్రేణులపై అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రమిచ్చారు. అనంతరం ఆ చౌరస్తా నుంచి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు ర్యాలీగా కాంగ్రెస్ శ్రేణులు వెళ్తుండగా అప్రమత్తమైన పోలీసులు కలెక్టరేట్ మెయిన్ గేట్‌ను మూసేశారు. దీంతో అక్కడ కాంగ్రెస్ నాయకులు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు గేటు తెరిచారు. ఒక్కసారిగా వారందరూ లోపలికి దూసుకెళ్లడంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ క్రమంలో మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల కిందపడి పోయారు. పోలీసులు వెంటనే ఆమెను పైకి లేపి పక్కకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో మహిళలకు గౌరవం లేదని.. కిందపడినా పట్టించుకోకుండా, చూడకుండా వెళ్లిపోయారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పై స్థాయి నాయకత్వం మహిళలపై గౌరవంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, శంకర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల

## లింగన్నగుట్టను తవ్వేస్తున్నారు..!

షాద్‌నగర్, డిసెంబర్ 24 : కేశంపేట మండలం సంగెం గ్రామ రెవెన్యూ పరిధిలోని లింగన్న పలుగుట్ట ప్రాంతంలో సర్వేనంబర్ 220లోని ఎకరం 31 గుంటల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు ప్రభుత్వం అసైన్డ్ చేసింది. ఆ రైతుల నుంచి కొందరు వ్యాపారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కుమ్మక్కై మట్టి వ్యాపారానికి తెరలేపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ భూమిని లీజ్ పేరుతో తీసుకుని మట్టిని తరలించేందుకు ఐదేండ్లకు రూ. 1,77,500 ఒప్పందం కుదుర్చుకుని.. ఏప్రిల్ 18న రూ.1,50,000 చెల్లించారని, అనంతరం ఎలాంటి అనుమతుల్లేకుండా రాత్రివేళల్లో మట్టిని ఇష్టానుసారంగా తవ్వుతూ టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. మట్టి అక్రమ తరలింపు గత కొన్ని రోజులుగా జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇక్కడ మట్టి వ్యాపారం జరుగడం లేదని.. అసైన్డ్ పొందిన రైతులే భూమిని చదును చేసుకుంటున్నారని వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నారని, గుట్టపైకి ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేసి మట్టిని తరలిస్తున్నా అధికారులకు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మట్టి వ్యాపారులతో అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై విలువైన సహజ సంపదను కొల్లగొడుతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై కేశంపేట తహసీల్దార్ అజాంఅలీఖాన్‌ను వివరణ కోరగా.. ఘటనాస్థలానికి అధికారులను పంపించి మట్టి వ్యాపారాన్ని గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



- రాత్రివేళల్లో జోరుగా మట్టి దందా
- ప్రభుత్వ భూమి నుంచి యథేచ్ఛగా తరలింపు
- కాంగ్రెస్ నాయకుల అండదండలతోనే..
- చర్యలు తీసుకోవడంలో అధికారుల వెనుకడుగు